క్లుప్తంగా

పరామర్శ



కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె. కొత్తపాలెం మాజీ సర్పంచ్ చందన సుబ్బారావు మాతృమూర్తి ఆదెమ్మ(94) ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వారి ఇంటికి వెళ్లి మాజీ సర్పంచ్ సుబ్బారావును పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మాజీ పీఏసీఎస్ చైర్‌పర్సన్ కృష్ణ, మత్తి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జోడుగూడెంలో చేపల చెరువు పరిశీలన

చిట్టూర్పు(ఘంటసాల): చేపలు చెరువులో ఎలాంటి తవ్వకాలు జరగకుండా రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించాలని ఘంటసాల తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆదేశించారు. ఘంటసాల మండలం చిట్టూర్పు జోడుగూడెంలో చేపల చెరువును తహసీల్దార్ విజయప్రసాద్ సోమవారం సందర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చెరువు కట్టలు అభివృద్ధి చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, చెరువులో తవ్వకాలు చేపట్టకుండా వీఆర్వో, వీఆర్ఏలు పర్యవేక్షించాలని సూచించారు.

సమరసత ఆధ్వర్యాన సత్సంగం

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యాన ధర్మనిధి సత్సంగం నిర్వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఆంజనేయులు, సుబ్బారావు, వెంకట రమణ మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం తదితర పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కలిగించారు. 40మంది గ్రామస్తులు సంస్థ ధర్మనిధి సభ్యత్వం పొందారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, వ్యవస్థాపక ధర్మకర్తలు పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, మెండు సాయిరామ్ పర్యవేక్షించారు.

చౌడేశ్వరి భజన గుడి వద్ద గోమాతకు ప్రత్యేక పూజలు

పెడన: శ్రీరామలింగ చైడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాలను పురస్కరించుకుని తొలుత అమ్మవారి భజన గుడివద్ద గోమాతకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఊటుకూరి ఏకనాథ్ సుధీర్‌కుమార్, హేమకన కదుర్గ నాగరాణి దంపతులతో గోమాతకు, ఆవుదూడకు ప్రత్యేక పూజలు చేశారు. పుర వీధుల్లో నిర్మించిన చలువ పందిళ్ల కింద వాటిని ఊరేగించారు. కుంకుమను ఉత్సవ కమిటీ వారు యువతకు అందజేసి అందరికీ పంపిణీ చేయాల్సిందిగా కోరారు. ఈ ఉత్సవాలను మంగళవారం వేకువ జామున 4.35 గంటలకు ప్రారంభమవుతాయని నిర్వహకులు తెలిపారు.

భావనారుషి ఆలయాభివృద్ధికి రూ.51,116 విరాళం

ఘంటసాల: స్థానిక భద్రావతి సమేత భావనారుషి స్వామి దేవాలయాభివృద్ధికి రూ.51,116 విరాళాన్ని మురుగు నాంచారయ్య, లక్ష్మీ దంపతులు చైర్మన్ అందె జగదీష్‌కు సోమవారం అందించారు. జగదీష్ మాట్లాడుతూ ఆలయ ముఖ మండపానికి స్టీల్ గ్రిల్ నిమిత్తం రూ.4.50 లక్షలతో అంచనాలు రూపొందించగా ఆలయ కమిటీ సభ్యులు మురుగుడు నాంచారయ్య, లక్ష్మీ దంపతుల కుమారుడు యోగేంద్ర - అనుపమ దంపతులు రూ.51,116 విరాళాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రాధాకృష్ణన్

కోనేరుసెంటర్: మచిలీపట్నం మండలం గ్రేడ్ -1 టు గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా జె. రాధాకృష్ణన్ (చిన్నాపురం పంచాయతీ కార్యదర్శి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కె. కోటేశ్వరరావు (గరాలదిబ్బ), ఉపాధ్యక్షుడిగా జె. రవిశంకర్(మేకవానిపాలెం), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బి. వి సుబ్బారావు (ఎస్ఎన్ గొల్లపాలెం), కోశాధికారిగా బి.అనీల్‌కుమార్ (మంగినపూడి), ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. ఈవోపీఆర్డీ బాలకృష్ణరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎంపీడీఓ సీహెచ్ వెంకటేష్, డీఎల్‌పీవో సీతా రామయ్య తదితరులు ఎన్నికైన సంఘాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస రావు, కార్యాలయ సిబ్బంది, గ్రేడ్ 1-గ్రేడ్ 6 పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ అర్చకుడిపై దాడి అమానుషం

అవనిగడ్డ: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సి.ఎస్.రంగరాజన్‌పై దాడి అమానుషమని ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయబాబు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. రామరాజ్యం పేరుతో అర్చకుడిపై దాడి చేయడం హిందూ సమాజాన్ని దాడి చేయడమేనని పేర్కొన్నారు. శ్రీరామరాజ్యం కాంతికి మార్గమని హిందూ దారు. అర్చకుడిపై దాడి చేసిన వారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయనతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఫణికుమార్ డిమాండ్ చేశారు.

దారులు ధ్వంసం

- ఓఎన్జీసీ నిర్లక్ష్యం
- భారీ వాహనాల రాకపోకలు
- బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో రోడ్లు గోతులమయం



భారీ వాహనాల రాకపోకలతో గోతులమయంగా మారిన గరిశపూడి-నిడమర్రు లింకు రోడ్డు

బంటుమిల్లి: బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలు దారులు ధ్వంసమై కనిపిస్తున్నాయి. దీనికి కారణం ఓఎన్జీసీ నిర్లక్ష్యమని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రెండు మండలాల్లో దాదాపు 15 ఏళ్లగా ఓఎన్జీసీ ఆయిల్ నిక్షేపాల కోసం బావుల తవ్వకం చేపట్టింది. ఇందులో భాగంగా కృత్తివెన్ను మండలం చినపాండ్రాక, గరిశపూడి, బంటుమిల్లి మండలం చోరంపూడి, కొర్లపాడు, అర్తమూరు, ములపర్రు గ్రామాల పరిధిలో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ పనులు చేపట్టింది. దీని కోసం భారీ వాహనాలు అధిక బరువులతో రాత్రిపగలు రాకపోకల కారణంగా ప్రధాన రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

అధ్వానంగా ఆర్అండ్‌బీ, జెడ్పీ రోడ్లు

బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఆర్అండ్‌బీ, జెడ్పీ రోడ్లు భారీ వాహనాల కారణంగా ధ్వంసమై గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయి. ఈ రెండు మండలాల్లో ఆర్అండ్‌బీ, జెడ్పీ రోడ్లు మాత్రమే 10 నుంచి 20 టన్నుల సాధారణ బరువులను తట్టుకోగల స్థాయిలో నిర్మాణాలు జరిగాయి. ఈ రోడ్లపై దాదాపు 40 టన్నులకు పైగా బరువున్న ట్రాలీలు తిరగడంతో రోడ్లు ఉనికిని కోల్పోయి పూర్తిగా ధ్వంసమై మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. ఇలాంటి రోడ్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఓఎన్జీసీ వారు తవ్వే ముందు ఒక మాట తవ్వేసిన తర్వాత మాట మార్చడంతో గ్రామస్తులు మండి పడుతున్నారు. తవ్వే ముందు అభ్యంతరాలు చెబితే మేమే రహదారులు నిర్మిస్తామని ముందుగా హామీలు ఇస్తున్న ఓఎన్జీసీ అధికారులు తర్వాత మొహం చాటేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇందుకు నిదర్శనం ఇటీవల బంటుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణే.



ఓఎన్జీసీ వాహనాల కారణంగా అధ్వానంగా మారిన అర్తమూరు-సాతులూరు ఆర్అండ్‌బీ రోడ్డు

ఆయా మండలాల్లో దెబ్బతిన్న రోడ్లు ఇవే..

అర్తమూరు-సాతులూరు రోడ్డు ఉనికిని కోల్పోయి మట్టి రోడ్డును తలపిస్తోంది. కొర్లపాడు జెడ్పీ రోడ్డు గుంతలు పడి ద్విచక్రవాహనాలకు తిప్పలు తప్పడంలేదు. ఈ క్రమంలో త్వరలో మళ్లీ డ్రిల్లింగ్ పనుల కోసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారని తెలిసింది. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. శాశ్వత రోడ్డును నాణ్యంగా నిర్మించాలని కొర్లపాడు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నిడమర్రు-గరిశపూడి జెడ్పీ లింకు రోడ్డు గోతులు పడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాయి. ఈ రోడ్డుపై దాదాపు 10 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణించాల్సి ఉంది. కృత్తివెన్ను మండలం, చినపాండ్రాక గ్రామంలో నుంచే తిరుగుతున్న వాహనాలతో గ్రామస్తులు నిద్రహారాలు లేక ఆందోళనకు సిద్ధమవుతూ అధికారులకు హెచ్చరికలు చేస్తున్నారు.

ఇచ్చినమాట నిలుపుకోని ఓఎన్జీసీ



అర్తమూరు గ్రామంలో ఓఎన్జీసీవారు డ్రిల్లింగ్ ప్రారంభించగానే గ్రామస్తులం వెళ్లి అడిగితే స్థానిక ఎస్టీలకు ఇళ్లు కడతామన్నారు. వలలు ఇప్పిస్తామన్నారు. గ్రామంలో అంతర్గత డ్రైయిన్ నిర్మిస్తామన్నారు. స్కూళ్లకు ఫర్నిచర్ ఇస్తామన్నారు. ఇందులో ఒక్కటి నెరవేరలేదు. పైగా రోడ్డు ధ్వంసమైంది. స్థలం మెరక చేసేటప్పుడు పడ్డ మట్టితో ద్విచక్ర వాహనాలు ప్రమాదాల పాలవుతున్నాయి. జేసీబీతో మట్టి తొలగించమన్నా తొలగించలేదు. అడగడానికి వెళితే రాజమండ్రి వెళ్లి మాట్లాడండి అని సమాధానం తప్ప స్పందించేవారు లేరు. ఓఎన్జీసీ వారు అర్తమూరు గ్రామానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మళ్లీ ఎటువంటి పనులు చేయనివ్వం.

-బొర్రా కాశీవిశ్వేశ్వరరావు,
రైతు నేత, అర్తమూరు

రోడ్డు గురించి అడిగితే పట్టించుకున్నవారు లేరు



216 జాతీయ రహదారి నుంచి డ్రిల్లింగ్ పాయింట్ వరకు ప్రధాన రోడ్డు పూర్తిగా గోతులు పడి దెబ్బతింది. సర్పంచ్‌గా మరమ్మతుల కోసం అనేకసార్లు అడిగితే ఆదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు తప్ప పనులు చేయలేదు. మళ్లీ ఇప్పుడు డ్రిల్లింగ్ చేయడానికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అలాకాకుండా శాశ్వతంగా రోడ్డు అభివృద్ధి చేయాలి. గతంలో డ్రిల్లింగ్ నిక్షేపాలు రాగానే పైపులు వేసి తరలించారు. గ్రామాలకు చేస్తున్నది ఏమీ లేదు.

-బోదావుల గాంధి,
మాజీ సర్పంచ్, కొర్లపాడు

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించండి

కలెక్టర్ డీకే బాలాజి



కోనేరుసెంటర్: పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్తలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన బందరు మండలంలోని ఎస్ఎన్ గొల్లపాలెం, అరిశేపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే ఆరోగ్యకరమైన వాతావరణంలో ప్రజలకు ఎటువంటి వ్యాధులు సంక్రమించవన్నారు. పొడి తడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేర్వేరు డస్ట్‌బిన్లలో వేస్తే వాటిని గార్బేజిలో వేరు చేయవచ్చన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా నిర్దేశించిన ప్రాంతాల్లోనే వేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లాలన్నారు. ఆహ్లాదకర జిల్లాగా తీర్చిదిద్దటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ లైన్ల నిర్వహణ

గూడూరు: మండలంలో విద్యుత్ లైన్ల నిర్వహణ చేపడుతున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గూడూరు ఏఈ మట్టా రాజేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పోలవరం, రామన్నపేట, ఐదుగుళ్లపల్లి, కంకటావ, ఆకులమన్నాడు, గండ్రం, నారికేడాలపాలెం, నాగవరం, లేళ్లగరువు, రామానుజవత్తర్లపల్లి గ్రామాలకు మంగళవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ స్థలం కబ్జాకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు
- టీడీపీ మాజీ కౌన్సిలర్ ప్రమేయం ఉందంటూ ఆరోపణలు



స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడుతున్న టీపీవో సుజనాకుమారి

పెడన: పట్టణంలోని రామలక్ష్మీవీవర్స్ కాలనీలో సర్వే నంబరు 472/3లో మున్సిపల్ స్థలంపై టీడీపీ నాయకుల కన్ను పడింది. దీని విలువ సుమారు కోటి రూపాయలు పైనే ఉంటుందని అంచనా. టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పరసా సూర్యనారాయణ ప్రోద్బలంతో ఆ స్థలాన్ని బాగు చేయించి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించేందుకు జేసీబీని వినియోగించారు. మున్సిపల్ అధికారులు బాగు చేయిస్తున్నారని స్థానికులు భావించారు. అయితే మున్సిపాలిటీ వారు కాదని టీడీపీ నాయకుడే ఈ పని చేయిస్తున్నాడని స్థానికులకు తెలిసింది. ఆ స్థలాన్ని బాగు చేయిస్తున్న వారిని ఆదివారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో నిలదీశారు. సచివాలయానికి చెందిన ప్లానింగ్ కార్యదర్శులు వెళ్లి వారిని హెచ్చరించడంతో ఆక్రమణదారులు వెళ్లిపోయారు. ఆదివారం అర్ధరాత్రి ఆక్రమణదారులు మట్టిని తోలి ఆ స్థలాన్ని చదును చేయడంతో సోమవారం ఉదయం ఆ స్థలాన్ని చూసిన స్థానికులు మరింత ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు. కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ స్థానికులు పేరక రాంబాబు, గంపాల మహేష్, కోటేశ్వరమ్మ, మేడక నాగులు, పులి పరమేశ్వరి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అడ్డుకోకపోతే ఆక్రమించేసే వారని అంటున్నారు.

పార్కు.. ఆస్పత్రి అన్నారు.. ఏమీ లేవు



మొదట్లో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. అదీ రాలేదు. ఆ తర్వాత ఆస్పత్రికి స్థలం ఇచ్చామని, హాస్పటల్ కడతారని అనుకున్నాం. అదీ కూడా కట్టలేదు. ఇప్పుడు ఖాళీగా ఉంది. దీనిని బాగు చేయిస్తుంటే ఏమైనా నిర్మాణానికి మున్సిపాలిటీ వారు స్థలం కేటాయించారేమో అనుకున్నాం. తీరా ఆక్రమిస్తున్నారని తెలిసి ఆందోళన చెందాం.

-తిప్పా కోటేశ్వరమ్మ,
రామలక్ష్మి వీవర్స్ కాలనీ, పెడన

ఫెన్సింగ్‌తో పాటు బోర్డులు పెడతాం



కాలనీలో స్థలాన్ని పరిశీలించాం. అక్కడ 472/3లో 18 సెంట్లు స్థలం మాత్రమే మున్సిపాలిటికి సంబంధించినది. దీనిని బాగు చేయించినట్లు ఫిర్యాదు రావడంతో పరిశీలించారు. స్థానికులు కూడా ఫిర్యాదు చేశారు. దీని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు కౌన్సిల్‌కు తెలియజేస్తాం. నేమ్ బోర్డు కూడా పెడతాం.

-బి.సుజనాకుమారి,
టీపీవో, పురపాలక సంఘం, పెడన

అగ్ని బాధిత కుటుంబానికి పరామర్శ



కొత్తపూడిలో అగ్నిబాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. కొత్తపూడి గ్రామంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబాన్ని పేర్ని కిట్టు స్థానిక నేతలతో కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అధైర్యపడొద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మండలంలోని పిల్లారిశెట్టిపాలెంలో ఇటీవల మరణించిన కేశన నాగరాజు కుటుంబాన్ని కిట్టు కలిసి పరామర్శించారు. నాగరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, వేముల ఏడుకొండలు, మందా బాబురావు, పిప్పళ్ల నాగబాబు, గాజుల నాగరాజు, గడిదేశి రాజుప, గోపు మురళీ పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్

కోడూరు: హంసలదీవి బీచ్ రోడ్డులో పంచాయతీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈ నెల 12న బీచ్ వద్ద సింధుస్నానాల నేపథ్యంలో పనులు జరిపారు. పాలకాయతిప్ప కరకట్ట వద్ద నుంచి సముద్రం వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లచెట్లను తొలగించారు. కరకట్ట దిగువన అటవీ ప్రాంతంలోకి రావడంతో యంత్రాల సహాయంతో కాకుండా కూలీలతో పనులు నిర్వహించారు. కోడూరు, ఘంటసాల ఈఓపీఆర్డీలు నాగరేవతి, వెంకటేశ్వరరావు, కార్యదర్శి లీలాప్రియాంక పర్యవేక్షించారు.

-హంసలదీవి బీచ్ వద్ద పంచాయతీ అధికారులు శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. మాఘపౌర్ణమి నేపథ్యంలో ఈ నెల 12న సాగరతీరంలో సింధుస్నానాలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. డీపీఓ ఆదేశాలతో కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి, ఘంటసాల నుంచి బీచ్ పరిసరాల ప్రాంతాలు శుభ్రం చేసేందుకు ప్రత్యేక శానిటేషన్ సిబ్బందిని నియమించారు. బీచ్ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లారు. శానిటేషన్ లోపించకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి ఎంపీడీఓ సుధాప్రవీణ ఆదేశించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి లీలాప్రియాంక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాగాయలంక పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓగా కోసూరు

నాగాయలంక: ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్)కు ఇన్‌చార్జి సీఈఓగా కోసూరు వెంకట రామాంజనేయులును నియమిస్తూ కేడీసీసీ జిల్లా స్థాయి ఎంపవర్డ్ కమిటీ(డీఎల్ఈసీ) సీఈఓ ఉత్తర్వులు గత వారం జారీ చేశారు. ఆయన మండలంలోని పెదకమ్మవారిపాలెం పీఏసీఎస్ సీఈఓగా ఉన్నారు. తర్వాత ఉత్తర్వులు ఇచ్చేవరకు డిప్యూటేషన్ కొనసాగుతుందని డీఎల్ఈసీ ఆర్డర్‌ను ఉటంకిస్తూ స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రెహమున్నీసా సోమవారం వెల్లడించారు.

కుష్ఠును ప్రారంభదశలో గుర్తిస్తే నివారించవచ్చు

పెడన: కుష్ఠు వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే దానిని నివారించడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని లెప్రా సొసైటీ ఫిజియోథెరపిస్టు నాగరాజు అన్నారు. పెడన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో సోమవారం లెప్రా సొసైటీ ఆధ్వర్యాన ఆర్ఎంపీలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కుష్ఠును ప్రారంభదశలో గుర్తించి ఎండీటీ ద్వారా చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వ డెప్యూటీ పారామెడికల్ అధికారులు షేక్ అబ్దుల్‌ఖుతూస్, జి.వెంకట్రావులు వ్యాధి లక్షణాలు, వాటి రకాలు, పరీక్ష విధానాలు తదితర వాటిపై ఆర్ఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ఓఆర్‌డబ్ల్యూ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో లోహమయ రాజగోపుర ప్రతిష్ఠ

గూడూరు: ఆకులమన్నాడు శివారు చిన్న ఆకులమన్నాడులోని శ్రీ హనుమత్ సమేత సీతాలక్ష్మణ సమేత అభయ కోదండ రామస్వామి ఆలయంలో లోహమయ రాజగోపుర ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. శత్రుఘ్న ఆచార్యుల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వేదపండితులు ప్రత్యేక పూజలు, హోమం చేశారు. అనంతరం నాగరాజ స్వామి, గణపతి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం జరిగింది.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అధ్యాపకులు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆరోగ్య సూత్రాలతో కూడిన నినాదాలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనతను నివారించడానికి ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, మాంసాహారం తినాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి కడుపులో నులి పురుగులను నివారించడానికి ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

కొత్తపూడిలో అగ్నిప్రమాదం

కోనేరుసెంటర్: బందరు మండలం కొత్తపూడిలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఘటనలో బాధిత కుటుంబం సర్వం కోల్పోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. బందరు మండలం కొత్తపూడి గ్రామానికి చెందిన మాదిరెడ్డి చిరంజీవి సుబ్బారావు వ్యవసాయం చేస్తుంటాడు. రోజులానే కుటుంబసభ్యులు ఇంటికి తాళం పెట్టి పొలం పనుల నిమిత్తం వెళ్లారు. మిట్ట మధ్యాహ్నం ఉన్నట్టుండి చిరంజీవి ఇంట్లో నుంచి మంటలు రేగాయి. పొగ ఇంటిని కమ్మేసింది. అగ్నిప్రమాదం సంభవించినట్లు గ్రహించిన గ్రామస్తులు వెంటనే అగ్నిమాపకశాఖ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు మొత్తం కాలి బూడిదైపోయింది.

నేటి నుంచి 'గ్రిగ్' గరల్స్ సెంట్రల్ జోన్ పోటీలు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 11, 12 తేదీల్లో 84వ గ్రిగ్ మెమోరియల్ గరల్స్ సెంట్రల్ జోన్ పోటీలు నిర్వహించడానికి సన్నద్ధం చేస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, సాఫ్ట్‌బాల్, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పలు క్రీడా కోర్టులను వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధం చేశారు.

మరణంలోనూ పలువురికి ప్రాణదానం



బుద్దన కోటేశ్వర రావు (ఫైల్)

కృత్తివెన్ను(పెడన): కృత్తివెన్ను మండలం నీలిపూడికి చెందిన బుద్దన కోటేశ్వరరావు (55) మరణించి కూడా అవయవదానంతో పలువురిలో జీవించాడు. నీలిపూడికి చెందిన కోటేశ్వరరావు ఈ నెల ఐదో తేదీన బంటుమిల్లి ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి కోటేశ్వరరావు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కోటేశ్వరరావు మరణించినా అతని అవయవాలతో కొందరికైనా పునర్జన్మ ఇవ్వాలని బంధువులు తలచారు. ఆయన అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నాళ్లుగా కోటేశ్వరరావు కుటుంబం బంటుమిల్లిలో నివసిస్తోంది. అతని మరణంతో నీలిపూడి, బంటుమిల్లి గ్రామాల్లో తీవ్ర విషాదం అలముకుంది. ఆయన అంత్యక్రియలు బంటుమిల్లిలో జరుగుతాయని బంధువులు తెలిపారు.

నులిపురుగు నివారణ మందులు వాడాలి



చాట్రగడ్డవానిగూడెం పాఠశాలలో ఆల్బెండజోల్ మందులు వేస్తున్న ఏఎన్ఎం సునీత

ఘంటసాలపాలెం(ఘంటసాల): నులిపురుగు నివారణ మాత్రలు వాడాలని బాల బాలికల్లో రక్తహీనత దూరం చేయవచ్చని ఘంటసాలపాలెం పీహెచ్‌సీ డాక్టర్ యు.నిఖిత ప్రసాద్ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఘంటసాల మండలం ఘంటసాలపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని జెడ్పీ హైస్కూల్స్, పాఠశాలలు, అంగన్‌వాడీల్లోని చిన్నారులు, విద్యార్థులతో పాటు 1నుంచి19 సంవత్సరాల వయస్సున్న వారు 785 మంది ఉండగా 754 మందికి నులిపురుగు నివారణకు ఆల్బెంజోల్ మాత్రలు వేసి 96 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి ఈ నెల 17 పంపిణీ చేస్తామన్నారు. ఘంటసాలపాలెం సచివాలయ పరిధిలో ఏఎన్ఎం జి.సునీత సిబ్బందితో కలసి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో పీటీ భాస్కర్, ఎంపీహెచ్ఏ సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఎంలు కె.సాల్మన్ రాజు, ఆర్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు: నులిపురుగు నివారణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను అందించారు. వైద్యాధికారులు నాషిన్, శిరీషల పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు విద్యార్థులు ఈ మాత్రలను పంపిణీ చేశారు.

పెళ్లికుమారుడిగా వేణుగోపాలుడు



కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశేషస్నపన, ఉత్సవమూర్తులకు అభిషేకాలను భక్తిప్రపత్తులతో జరిపారు. వేణుగోపాలుడిని పెండ్లికుమారుడిగా, రుక్మిణీ, సత్యభామ అమ్మవార్లను పెళ్లికుమార్తెలుగా అలంకరించి పూజలు చేశారు. శృంగేరీ పీఠం దత్తత దేవాలయం కావడంతో పీఠం ప్రతినిధులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్వామివారి మూలవిరాట్‌కు పుష్పాభిషేకాన్ని కనులపండువగా జరిపారు. మంగళవారం ఉదయం రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, రాత్రికి ఆరుబయట ఉన్న కల్యాణ వేదికలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బంగారు పతక విజేత గాయత్రికి సత్కారం



అవనిగడ్డ: జాతీయస్థాయి కనోల్ స్లాలం(కె-1) పోటీల్లో బంగారు పతకం సాధించిన నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం రాత్రి సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో గాయత్రి, ఆయన సోదరుడు, తల్లిదండ్రులు నాగబాబు, వెంకట నాగేశ్వరమ్మ, మేనత్త లక్ష్మీకుమారిని సత్కరించారు. రూ.15వేలు ప్రోత్సాహక నగదు బహుమతిని అందించారు.